

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

మంగళవారం,10 మార్చి 2026 8 పేజీలు





# ధాన్యపు 'కోట'.. మిల్లర్ల 'వేట'!

**కాకినాడ జిల్లాలో ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియ ఇప్పుడు ఒక చదరంగంలా మారింది. జిల్లా నిర్వాహకులు నాయక్, జిల్లా సరఫరా అధికారి సత్యనారాయణరాజు తమ శక్తికి మించి కష్టపడుతున్నారు. అయినా రాజకీయ ఒత్తిళ్ల ముందు వారి అధికారం వణుకుతోంది. నిబంధనల అమలుకు వారు ప్రయత్నిస్తున్నా, రాజకీయ జోక్యం అధికారుల చేతులను కట్టేస్తోందా అన్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయి.**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :**

- గుట్టు విప్పనున్న జేసీ మెగా ఆడిట్!
- వేట్లపాలెంలో దొరికిన అక్రమాలు
- మిల్లర్ల లెక్కలపై అధికారుల పంజా!
- కొన్ని మిల్లులలోకే వేల మెట్రిక్ టన్నులు కేటాయింపుపై అనుమానాలు
- రీసైక్లింగ్ ముమ్మాటికి జరుగుతుంది!
- మార్చి 31 గడువు: రికార్డులు తేలకపోతే మిల్లుల మూసివేత తప్పదు !
- ప్రభుత్వ ధాన్యం భద్రతపై ప్రశ్నలు
- పాత బియ్యం రంగు మార్చే ఆటలు.. డబ్బుకు దాసోహం!

పౌరశాఖ కమిషనర్ అండదండలతో రైస్ మిల్లు యాజమాన్యాలు అధికంగా ధాన్యం కేటాయింపులు చేసుకున్నారు అన్నట్లుగా తెలుస్తోంది. నిల్వ ఉంచేందుకు కనీసం గిడ్డంగుల సామర్థ్యం లేకపోయినా, కొన్ని ఎంపిక చేసిన మిల్లులకే వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కట్టబెట్టడం వెనుక భారీ మర్మం దాగిఉంది. మార్చి 9,2026 నాటి తాజా గణాంకాల ప్రకారం, ఇంకా 95,228 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి చేరాల్సి ఉంది. ఈభారీబకాయిలను వసూలు చేయడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ముఖ్యంగా వేట్లపాలెం రైస్ మిల్లును జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ స్వయంగా తనిఖీ చేయగా అక్కడనిల్వలు అత్యంత గందరగోళంగా ఉన్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ ధాన్యానికి సంబంధించి వేట్లపాలెం రైస్ మిల్లులో నిల్వలను ఒక క్రమ పద్ధతిలో ఉంచకుండా, రకరకాలుగా మూలకు ఇష్టారాజ్యంగా పడేశారు. లెక్కలు ఏమాత్రం తెలియకుండా, నిబంధనలకు విరుద్ధంగా ధాన్యాన్ని నిల్వ ఉంచిన తీరుపై అపూర్వ భరత్ విస్మయం వ్యక్తం చేశారు. ఇక్కడ కేటాయింపులు మరియు అసలు నిల్వల మధ్య పొంతన లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఈ తనిఖీల అనంతరం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ జిల్లా సరఫరా అధికారి సత్యనారాయణ రాజును కఠినంగా ఆదేశించినట్లు తెలిసింది.

- తరువాయి 2లో..




# అభివృద్ధి పథంలో 'పన్ను' భాగస్వామ్యం!



కలెక్టర్ షాణ్మోహన్

**మీరు కట్టే పన్నే.. మీ ఊరి వెలుగు! ఇంటి పన్ను చెల్లించి గ్రామ వికాసంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు.బకాయిలు చెల్లించని పక్షంలో పంచాయితీ సేవలు నిలిపివేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలోని 385 పంచాయితీల్లో ఇంకా రూ.47.93 కోట్ల బకాయిలు ఉన్న నేపథ్యంలో, ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తక్షణమే పన్నులు చెల్లించి బాధ్యత చాటుకోవాలని కోరారు.**

గ్రామ ప్రగతికి మీ పన్నులే పునాది..
సకాలంలో చెల్లించి ఆదర్శంగా నిలవండి
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పిలుపు
- మొండి బకాయిదారులపై కఠిన చర్యలకు హెచ్చరిక

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** గ్రామం అంటే కేవలం మనుషుల సమూహం కాదు.. అది ఒక జీవనాడి. ఆ నాడి సక్రమంగా కొట్టుకోవాలన్నా, వీధులుకాంతితోవెలగాలన్నా,పారిశుధ్యం పరిమళించాలన్నా గ్రామ పంచాయితీలకు ప్రజల సహకారం అనివార్యం. ఈ నేపథ్యంలో, జిల్లాలోని గ్రామ పంచాయితీల ఆర్థిక పుష్టిపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా అభివృద్ధికి ఇంటి పన్నులే ఇంజిన్ లాంటివని, వాటిని సకాలంలో చెల్లించి ప్రతి పౌరుడు గ్రామ వికాసంలో భాగస్వామి కావాలని ఆయన కోరారు.

**లక్ష్యం భారీ..వసూళ్లు సగం!**

జిల్లాలోమొత్తం385గ్రామ పంచాయితీలు ఉండగా,2025-2026ఆర్థిక సంవత్సరానికి గాను పాత బకాయిలతో కలిపి మొత్తం రూ.97.98కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది. అయితే, ఇప్పటి వరకు కేవలం రూ.50.04 కోట్లు మాత్రమే వసూలవ్వడం పట్లకలెక్టర్కొంత అసహనం వ్యక్తం చేశారు. ఇంకా రూ.47.93 కోట్లు పెండింగ్‌లో ఉండటం వల్ల గ్రామాల్లో కనీస మౌలిక వసతులకల్పనకుఆటంకం కలుగుతోందని ఆయన విశ్లేషించారు.

**పన్ను కట్టకపోతే..సేవలు కట్!**

వసూళ్ల విషయంలో ఇకపై ఉదాసీనత వహించే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా పన్నులు చెల్లించని వారిపై చట్టపరమైనచర్యలుతప్పవనిహెచ్చరిస్తూకీలకనిర్ణయాలు ప్రకటించారు

- **సేవల నిలిపివేత:** పన్నులు చెల్లించని ఇళ్లకు చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ నిలిపివేస్తారు.

-**వీధిదీపాలు &ధృవపత్రాలు:**వీధి దీపాల నిర్వహణతో పాటు పంచాయితీ నుంచి పొందే ఎటువంటి ధృవపత్రాలనైనా నిలిపివేసే అవకాశం ఉంది.

**ప్రభుత్వ కార్యాలయాలకూ ఆదేశాలు:** కేవలం

- తరువాయి 2లో..

# సేవాపథంలో సరికొత్త రికార్డు..

-19 నెలల్లో 673 మందికి రూ.5.12 కోట్ల లబ్ధి -మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు, మేజర్‌న్యూస్ :** కన్నీరు తుడిచే చేయి.. కష్టం తీర్చే గుండె.. కూటమి ప్రభుత్వానికి నిరంతర ఆయుధాలు" అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందులదుర్గేష్ ఉద్ఘాటించారు. నిరుపేదల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా, ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవనిలా మారుతోందని ఆయన అభివర్ణించారు. సోమవారం నిడదవోలులోని తనక్యాంపు కార్యాలయంలో 38మంది లబ్ధిదారులకు రూ.26,32,753 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మరియు

- తరువాయి 2లో..

# ముస్లిం మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం





– శాసనసభ్యులు వనమాడి కొండబాబు

కాకినాడ, మేజర్ న్యూస్ : ముస్లిం మైనారిటీలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆ అల్లా ఆశీసులు అందరిపై ఉండాలని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.స్థానిక కొత్తపేట నగీన మసీదు నందు సోమవారం మసీద్ కమిటీ వారు నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఆధునికరించిన కొత్తపేట నగీన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయని, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలనేసత్యాన్ని రంజాన్ మాసం బోధిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగీన మసీదు కమిటీ అధ్యక్షులు ఇక్బాల్ ఆలీ, ఎం.డి. అలీ ఖాన్, ముస్తఫ అలీ ఖాన్, మదని హుస్సేన్ ముహిద్దీన్ ఖాన్, సయ్యద్ రఫీబ్ అలీఅహ్మద్,మైనార్టీ నాయకులుఎం.డిఖాన్,ఎస్.కె.రహీమ్, ఎం.ఎ.తాజుద్దీన్, ఎం.డి.కరీముల్లా, కసుమూర్, కూటమి శ్రేణులు గుజ్జు లక్ష్మణరావు, రిక్కా సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యపు 'కోట'...మిల్లర్ల 'వేట'!

# లక్ష టన్నుల బియ్యం మిల్లులోనేనా?

మొదటిపేజీ తరువాయి

ఏపి మిల్లులో ఎంతెంత నిల్వలు సక్రమంగా ఉన్నాయో తక్షణమే తేల్చాలని,సుమారు లక్ష టన్నుల పైగా ప్రభుత్వ ధాన్యం మిల్లుల్లో ఉండిపోయిన నేపథ్యంలోనిల్వఆడిట్‌నివేదికలను యుద్ధప్రాతి పదికన తయారు చేయాలని స్పష్టం చేశారు.ఈఆడిట్ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది, ఏయే మిల్లుల్లో నిల్వలు సరిగ్గా ఉన్నాయనే వివరాలను జిల్లా సరఫరా అధికారి బహిర్గతం చేయాల్సి ఉంది. ప్రతి మిల్లులోనూ క్షుణ్ణంగాఆడిట్ జరపాలని, ఎక్కడా ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టకుండా బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అపూర్వభారత్ ఆదేశించారు.

**ముఖ్య బకాయిదారుల చిట్టా: ఇంకా 20 రోజులే గడువు.. ఈ నిల్వలు సక్రమంగా ఉన్నాయా?**

ఈ మిల్లుల మీద నిల్వ తనిఖీలు ఎవరు చేశారు? అసలు అక్కడ రక్షణ అధికారి ఎవరు? ప్రభుత్వం కేటాయించిన ఈ భారీ నిల్వలు మిల్లుల్లో సక్రమంగా ఉన్నాయా లేక లోపల ధాన్యం మాయమైందా అన్నది తేల్చాల్సి ఉంది. ఒకవేళ ధాన్యం లేకపోతే, బయట పాత బియ్యం కొని ప్రభుత్వానికి ఇచ్చి తప్పించుకోవాలని చూస్తున్నారా? దీనిపై రక్షణ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రభుత్వం కేటాయించిన నిల్వల వివరాలు ఎక్కడా ప్రదర్శన బోర్డుల్లో కనబడకపోవడం వెనుక ఆంతర్యమేమిటి? ముఖ్యంగా పెద్దాపురం, పెదపూడి మరియు సామర్లకోట మండలాల్లోని మిల్లులు అత్యధిక బకాయిలు కలిగి ఉండి సమస్యాత్మకంగా మారాయి.

పట్టాభి ఆగ్రో ఫుడ్స్ (యూనిట్-1, పెద్దాపురం) కి 42,345 మెట్రిక్ టన్నులు కేటాయించగా 15,548.867 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 2. పట్టాభి ఆగ్రో ఫుడ్స్ (యూనిట్-2, పెద్దాపురం) కి 38,920 మెట్రిక్ టన్నులు కేటాయించగా 12,147.232 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 3. శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్ (గండేడు) కి 18,450 మెట్రిక్ టన్నులకి 5,050.450 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 4.సాయి గాయత్రి రైస్ ఇండస్ట్రీస్ (పెద్దాపురం)కి 14,200 మెట్రిక్ టన్నులకి 3,180.245 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 5.కె.వి.ఆర్. రైస్ మిల్ (కరప) కి 12,800 మెట్రిక్ టన్నులకి 2,854.120 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 6. ఎస్.ఎస్.బి. ఆగ్రో ఇండస్ట్రీస్ (కాకినాడ గ్రామీణ)కి 11,500 మెట్రిక్ టన్నుల కి 2,420.500 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 7. వినాయక రైస్ ఎగుమతులు (సామర్లకోట) కి 10,200 మెట్రిక్ టన్నుల కి 2,150.330 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 8. శ్రీ విజయలక్ష్మి రైస్ మిల్ (జగ్గంపేట) కి 9,800 మెట్రిక్ టన్నులకి 2,050.110 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 9. లక్ష్మి గణపతి ఆగ్రో టెక్ (పిఠాపురం) కి 9,500 మెట్రిక్ టన్నుల కి 1,980.450 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 10. శ్రీ సాయి మల్లికార్జున ఇండస్ట్రీస్ (కరప) కి 8,900 మెట్రిక్ టన్నుల కి 1,850.120 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 11. మారుతి రైస్ ఇండస్ట్రీస్ (పెద్దాపురం) కి 8,500 మెట్రిక్ టన్నులకి 1,740.660 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 12. గెలాక్సీ ఆగ్రో ఇండస్ట్రీస్ (జగ్గంపేట) కి 8,200 మెట్రిక్ టన్నుల కి 1,620.400 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 13. శివ శంకర్ రైస్ మిల్ (కాకినాడ) కి 7,800 మెట్రిక్ టన్నుల కి 1,510.220 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 14. అన్నపూర్ణ ఆగ్రో ఎగుమతులు (సామర్లకోట) కి 7,500 మెట్రిక్ టన్నుల కి 1,480.110 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 15. శ్రీ రామకృష్ణ రైస్ మిల్ (రామచంద్రాపురం) కి 7,200 మెట్రిక్ టన్నుల కి 1,420.550 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 16. గోదావరి ఆగ్రో ఇండస్ట్రీస్ (ముమ్మిడివరం) కి 6,900 మెట్రిక్ టన్నులకి 1,380.220 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 17. వెంకట సాయి రైస్ మిల్ (జగ్గంపేట) కి 6,500 మెట్రిక్ టన్నుల కి 1,310.440 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 18. శ్రీ లక్ష్మి నరసింహ ఇండస్ట్రీస్ (పిఠాపురం) కి 6,200 మెట్రిక్ టన్నులకి 1,250.330 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 19. దుర్గా భవాని ఆగ్రో టెక్ (పెద్దాపురం) కి 5,800 మెట్రిక్ టన్నుల కి 1,180.220 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది, 20. సరస్వతి రైస్ మిల్ (కాకినాడ) కి 5,500 మెట్రిక్ టన్నుల కి 1,120.110 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది మరియు పెదపూడి మండలంలోని పలు మిల్లులకు కూడా భారీగా ధాన్యం కేటాయింపులు జరగగా బకాయిలు ఇంకా మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది.

**బహిరంగ రహస్యం:మిల్లుల్లో నిల్వలు ఉన్నాయా.. మాయమైందా?**

జిల్లాలోని పలు మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం ఇప్పటికే నల్లబజారుకు తరలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల బస్తాల ధాన్యాన్ని నిల్వ ఉంచే సామర్థ్యం లేకపోయినా మిల్లులకు ఎందుకు కేటాయింపులు చేశారు? మిల్లులపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, భౌతిక పరిశీలన ఎందుకు చేయడం లేదు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**సాంకేతిక అధికారుల వైఫల్యం: పాత బియ్యం వ్యూహం?**

బియ్యం నాణ్యతను పరీక్షించాల్సిన సాంకేతిక అధికారులు మిల్లర్లతో కుమ్మక్కయ్యారనే అనుమానాలు ఉన్నాయి. పరీక్షల్లో బియ్యం ఆకుపచ్చగా వస్తాయా లేక పాత బియ్యంలా నారింజ రంగులోకి మారుతాయా అనేది తేల్చాల్సి ఉంది. ఒకవేళ ఇప్పటికే సేకరించి ఉన్న నిల్వలు నారింజ రంగు వస్తే అది పక్కా మోసమే.

ప్రభుత్వ ధాన్యానికి రక్షణ లేదని ప్రజల ఆగ్రహం!

ప్రజా ధనంతో కొన్న ధాన్యానికి రక్షణ కల్పించాల్సిన అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, ఈ నెలాఖరు లోపు లక్ష టన్నుల బియ్యం రాకపోతే వందల కోట్ల ప్రజాధనం మిల్లర్ల జేబుల్లోకి వెళ్లినట్లేనా... తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మిల్లర్ల దగ్గర నుంచి ఎఫ్‌సిఐకి బియ్యం సరఫరా జరిగేలాగా గట్టి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అభివృద్ధి పథంలో 'పన్ను' భాగస్వామ్యం!

మొదటిపేజీ తరువాయి

సామాన్య ప్రజలే కాదు, బకాయిలు ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల భవనాలకు కూడా తక్షణమే పన్నులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

**డిజిటల్ చెల్లింపులు.. ఇంటి వద్ద నుంచే!**

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ అరచేతిలో ఉన్న ఫోన్ ద్వారానే పన్నులు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. https://swarnapanchayat.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ప్రజలు సులభంగా తమ బాధ్యతను నెరవేర్చవచ్చు.

**సమష్టి బాధ్యత – సుందర గ్రామం**

"గ్రామ పంచాయితీకి రూపాయి చెల్లిస్తే.. అది తిరిగి వంద రూపాయల సేవగా మీ ఇంటి ముంగిటకే వస్తుంది" అని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ఈ పన్ను వసూళ్ల ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకుని ప్రజలను చైతన్యపరచాలని, నిర్ణీత గడువులోగా వంద శాతం వసూళ్లు సాధించి జిల్లాని ఆదర్శంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు.

## సేవాపథంలో సరికొత్త రికార్డు..

మొదటిపేజీ తరువాయి

ఎల్‌వోసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా పంపిణీ చేశారు. అందులో 35 మందికి రూ. 19,76,689 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, ముగ్గురికి రూ. 6,56,064 విలువైన ఎల్ వోసీ పత్రాలను మంత్రిదుర్గేష్ స్వయంగాఅందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ,గత 19నెలల కాలంలో నిడదవోలు నియోజకవర్గంలో అక్షరాలా 673 మందికి రూ. 5,12,20,251 లబ్ధి చేకూర్చామని సగర్వంగా ప్రకటించారు. "ప్రతి 15 రోజులకొకసారి పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందించడం నా రాజకీయ జీవితానికి లభిస్తున్న అసలైన సంతృప్తి" అని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు. వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్న కుటుంబాలకు ఈ నిధులు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల నుంచి పుట్టిన విప్లవాత్మక మార్పును మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య భీమా కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయని, ఇది 5 కోట్ల ఆంధ్రుల జీవితాలకు కొండంత అండగా నిలుస్తుందని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పమని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయి వైద్యం తమకు ఉచితంగా అందేలా చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు లబ్ధిదారులు నిండు మనసుతో ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో అండగా నిలిచిన నేతలను వారు ఆశీర్వదించడం కార్యక్రమానికి ఒక ప్రత్యేక శోభను చేకూర్చింది. ప్రభుత్వం చేస్తున్న ఈ మంచి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములై, సమాజ పునర్నిర్మాణానికి సహకరించాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకన్న సన్నిధిలో కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

– ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డిసి





ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని సోమవారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావులు స్వామివారి చిత్రపటాన్ని అందించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో క్యూ లైన్లు ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి డిసి పలు సూచనలు ఇచ్చారు.

# అదిగో పులి.. దూడపై దాడికి దిగింది



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** గత 7రోజులుగా గంగవరం, అడ్డతీగల, ఏలేశ్వరం మండలాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులి సోమవారం తెల్లవారుజామున మండలంలోని పరిమితడక గ్రామ పరిసరాల్లో శంఖా బత్తుల వీర్రాజు కు చెందిన గేదె పై దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత శుక్రవారం ఇదే ప్రాంతంలోని డి కృష్ణవరం గ్రామంలో ఆవు దూడను చంపిన పులి రెండు రోజులుగా కనుమరుగై మరలా పంజా విసిరింది. గత 20 రోజుల నుండి పోలవరం జిల్లా రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం మండలం, కాకినాడ జిల్లా జగ్గంపేట ఏలేశ్వరం మండలాల్లో సంచరిస్తున్న అటవీ అధికారుల సమన్వయ లోపంతో పులిని బంధించలేకపోయారని పలువురు ఆరోపిస్తున్నారు. పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అటవీ అధికారి పులి గురించి మాట్లాడుతూ జనవరి నెలలో చత్తీస్గఢ్ నుండి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్లో చేరిన పెద్దపులి రాజమండ్రి సమీపంలోని దివాన్ చెరువు కేశవరం రాయవరం ప్రాంతాల్లో సంచరించి గత నెల 6వ తేదీన కూర్మాపురం వద్ద ప్రత్యేక అధికారులు మత్తు ఇవ్వడం ద్వారా బంధించారు అన్నారు. అనంతరం విశాఖ జూలో చికిత్స అందించి పులి సంపూర్ణ ఆరోగ్యంగా ఉందని నిర్ధారణ చేసిన తర్వాత పాపికొండలు అటవి ప్రాంతంలో వదిలామన్నారు. పాపికొం డలు అభయారణ్యంలో జింకలు, దుప్పులు, ఇతర వన్యప్రాణులు ఉండడంతో పులికి ఆహారానికి కొరత ఉండదన్నారు.

అయితే ఆడ పులి కోసమే తిరిగి వెనక్కి వచ్చి ఉండవచ్చని అన్నారు. పులిని బంధించటానికి ఐదు బోనులు, మూడు ట్రాంక్విలైజర్ గన్స్, మత్తు ఇంజక్షన్లు, గన్ షూటర్లను, మత్తు వైద్యులను రప్పించామని తెలిపారు. పులికి గతంలో అమర్చిన యంత్రం ద్వారా విజయవాడ కార్యాలయం నుండి ఉదయం మధ్యాహ్నం సాయంత్రం ఎక్కడ ఉందో ట్రాకింగ్ ద్వారా సమాచారం అందుతుందని తొందరలోనే పులిని ప్రాణాలతో బంధిస్తామని దీమా వ్యక్తం చేశారు.

గేదిని చంపిన తర్వాత పులి అడ్డతీగల మండలం గొండోలు, కోనలోవ, గౌరంపేట వైపు వెళ్లినట్టు అనుమానిస్తున్నారు. గ్రామాల్లోని ప్రజలు ఎవరు ఒంటరిగా బయటకు రావద్దని, రైతులు తమ పశువులను పొలాల్లో కాకుండా ఇంటి వద్ద సురక్షితంగా ఉండేలా రక్షణ ఏర్పాటు చేసుకొని కట్టుకోవాలని, రాత్రి సమయంలో లైట్లు వెలిగించి ఉంచాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ఆరా -2026

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆరా-2026" కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సృజనాత్మక మరియు విద్యా సంబంధిత పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, భవిష్యత్తు వృత్తి జీవితానికి దోహదపడ తాయని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన చార్టర్డ్ అకౌంటెంట్ వి. సందీప్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు, సృజనాత్మకత మరియు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. బిజినెస్ క్విజ్, హెచ్‌ఆర్, ఐపీఎల్ బిడ్డింగ్, మొదలైన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కామర్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్



నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఏ.జి. ఆన్సర్ అలీ, అధ్యాపకులు అపర్ణ స్రవంతి, పి.నరసింహారావు, ఎం. రమణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





# అధైర్య పడొద్దు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే శిరీష భాస్కర్

**- ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళొద్దు, పశువులను వదలొద్దు : డీఎఫ్ఓ సుబ్బారెడ్డి**

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** జిల్లాలోని రాజవొమ్మంగి మండలం బోర్నగూడం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు ధ్రువీకరించారని స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాయంత్రం 6 దాటిన తర్వాత ఒంటరిగా తిరగరాదని పులిని సురక్షితంగా పట్టుకోవడానికి శ్రీశైలం అటవీ సిబ్బంది వస్తున్నారని ఎమ్మెల్యే శిరీష భాస్కర్ అన్నారు. పులి బోర్నగూడం అటవీ ప్రాంతంలో ఉన్నట్లు రేడియో కాలర్, పులిపాద ముద్రల ద్వారా నిర్ధారణ అయినట్లు సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి తెలిపారు. సాయంత్రం నాలుగు దాటిన తర్వాత అడవుల్లోకి ఒంటరిగా వెళ్లరాదన్నారు.

పశువులను వదలకుండా సురక్షిత ప్రాంతాల్లో కట్టడి చేయాలన్నారు. ఈ మేరకు బోర్నగూడం, సంజీవనగరం, చెరుకుంపాలెం, ఊర్లకులపాడు గ్రామాలలో ఫారెస్ట్ సిబ్బంది మైకు ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉషారాణి ఉన్నారు.

## గ్యాస్ రేటు పెంపుదల ఉపసంహరించుకోవాలి




పెద్దాపురం, మేజర్ న్యూస్ : వంట గ్యాస్ సిలిండర్‌కు రూ.60/-, వాణిజ్య సిలిండర్‌కు రూ.120/- పెంచడాన్ని నిరసిస్తూ ఆర్డీఓ కార్యాలయ వద్ద సోమవారం సిపిఎం పెద్దాపురం మండల కమిటి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్ దాడి, రష్యా నుండి ఆయల్ కొనుగోలుపై ఆంక్షలు నేపథ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై శరాఘాతంగా మారిందని, ఈ యుద్ధాన్ని ఖండించి, నిలుపుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనందని, ఆ భారాన్ని సామన్య ప్రజలపై పెట్టడం ఘోరమని అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సతమతమవుతున్న ప్రజలపై వంట గ్యాస్ ధరల పెంపుదల పెద్ద దెబ్బ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్యాస్ ధర పెంపుదలను ఉపసంహరించుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేదారి నాగు, కూనిరెడ్డి అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, రొంగల సుబ్బలక్ష్మీ, యాసలపు రమేష్, పలువురు పాల్గొన్నారు.

## త్రాగునీటి పరిష్కారానికి కృషి

**- ఎంపీపీ వెంకటలక్ష్మి**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలో త్రాగునీటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపిపి వెంకటలక్ష్మి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో క్రిస్ ప్రోగ్రామ్ మండలంలో చేతి పంపులు రిపేర్లు, ఫ్లసింగ్ కోసం 2026, 27 సం॥గాను బడ్జెట్‌లో 2 దఫాలకు గాను బడ్జెట్ ఆమోదించి, మొదటి దఫాగా నిధుల వెచ్చించడం జరిగిందని ఈ రోజు నుండి మండలంలో అన్ని గ్రామాల బోర్స్ మరమ్మత్తు ఏమైనా ఉంటే స్థానిక స్థానిక ఎంపీడీవోకు పత్రాలు అందజేస్తే గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ద్వారా త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ జెఈ సీతారామ నాయక్, సీనియర్ అస్సిటెంట్ పౌల్, సిబ్బంది లక్ష్మీ, సురేష్, అనిత పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 2 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ డిప్యూటి తహశీల్దార్ ఎం.వి.భానుకుమార్ తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటి తహశీల్దార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.డబ్లూఓ.వాణి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# దివ్యాంగుల సేవలో 'తదేకం ఫౌండేషన్' అభినందనీయం : మంత్రి కందుల దుర్గేష్

**– తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రైసైకిల్స్, ఎలక్ట్రికల్ స్కూటర్ పంపిణీ**

**నిడదవోలు, మేజర్ న్యూస్ :** సమాజంలోని అట్టడుగు వర్గాలకు, ముఖ్యంగా దివ్యాంగులకు అండగా నిలవడమే పరమావధిగా 'తదేకం ఫౌండేషన్' అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ కొనియాడారు. సోమవారం నిడదవోలులోని తన క్యాంప్ కార్యాలయంలో తదేకం ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ట్రైసైకిల్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గ్రీన్ రిబ్బన్ కట్ చేసి వాహనాలను ప్రారంభించారు. లబ్ధిదారులు కొప్పాక సీతారాంబాబు, మంత్రి ప్రగడదేవి, దాసరి శివలకు ట్రైసైకిల్స్, అలాగే పిడుగు గోవిందరాజుకు ఎలక్ట్రికల్ స్కూటర్‌ను అందజేశారు. ఈ పరికరాలను సద్వినియోగం చేసుకుని ఆనందంగా ఉండాలని లబ్ధిదారులను మంత్రి దుర్గేష్ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..ఒక ప్రైవేట్ సంస్థ అయినప్పటికీ సామాజిక బాధ్యతతో తదేకం ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ ఫౌండేషన్ స్థానిక ఇన్చార్జ్ సుధా మరియు వారి బృందం నిడదవోలు నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహకరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల కంటే మిన్నగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుండి రూ.6,000 కు పెంచిందని మంత్రి దుర్గేష్ గుర్తు



చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.15,000 సాయం అందిస్తున్నట్లు తెలిపారు.తదేకం ఫౌండేషన్ సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని పంపిణీ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల్లోనూ తదేకం ఫౌండేషన్ సహకారాన్ని కోరామని, వచ్చే నెల నుండి దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఇలాగే చేతులు కలిపితే పేదలకు మరింత మేలు జరుగుతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేద కుటుంబాలకు పెద్దకొడుకులా అండగా నిలుస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ ఆదేశాల మేరకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వర్మ సతీమణి లక్ష్మీదేవి లబ్ధిదారుల ఇంటికే స్వయంగా వెళ్లి, స్థానిక నాయకుల సమక్షంలో ఈ చెక్కులను అందజేశారు. చేబ్రోలు గ్రామానికి చెందిన మాకిరెడ్డి లక్ష్మి, పెండ్యాల అమ్మన్నలకు సుమారు 50 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనారోగ్య కారణాలతో వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకుంటామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి ఈ సహాయాన్ని



అందిస్తున్నారని వర్మ సతీమణి లక్ష్మీదేవి తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# ఏజెన్సీలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి



రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ కట్టడాలను తొలగించాలని, హైకోర్టు నిబంధనలు అనుసరించి రీ సర్వే చేయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేసారు. రంపచోడవరం ఐటీడీఏ పిజిఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పోలవరం జిల్లా రంపచోడవరం కలెక్టర్ పిజిఆర్ఎస్ లో పలు సమస్యలపై ఫిర్యాదు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ హైకోర్టు నిబంధనలు ప్రకారం మాత్రమే ఏజెన్సీ ప్రాంతంలో రీసర్వే చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో నాన్ ట్రైబల్స్ కు ఎటువంటి హక్కులు రీ సర్వే ద్వారా కల్పించవద్దని సబ్ కలెక్టర్ ని కోరడం జరిగింది. పోలవరం జిల్లా పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో నాన్ ట్రైబల్ భూములకు రీసర్వే చేస్తున్నారని, నాన్ ట్రైబల్ అధీనంలో ఉన్న భూములు అన్ని 1/70 చట్టానికి విరుద్ధంగా కబ్జా చేసిన భూములే అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం రీసర్వే ద్వారా నాన్ ట్రైబల్స్‌కు ఎటువంటి హక్కులు కల్పించవద్దని కోరడం జరిగిందన్నారు. అలాగే 1/59 చట్టం,1/70 చట్టానికి విరుద్ధంగా పొందిన నాన్ ట్రైబల్స్ భూ హక్కులు రద్దు చేయాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీలో నాన్ ట్రైబల్స్ విచ్చలవిడిగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని, ఒకపక్క ఉన్నత అధికారులు అక్రమ కట్టడాలు తొలగించాలని, నూతన కట్టడాలకు అనుమతులు వద్దని చెబుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు అండదండలతో తొలగించిన చోటే నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, అక్రమ కట్టడాలకు అండదండలుగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేయడం జరిగింది.

అలాగే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన కోటం బాపనమ్మ (మాతా శిశు మరణం) కుటుంబానికి న్యాయం చేయాలని కోరడం జరిగింది. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ సంబంధిత శాఖలకు దరఖాస్తులు పంపించి చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీఠ ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు బొరగ గంగరాజు దొర, కోటం రాజన్న దొర, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం సత్యదేవుని సన్నిధిలో తుమ్మల రామస్వామి



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి కాకినాడ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) చైర్మన్ మరియు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు దర్శనార్థం తుమ్మల రామస్వామి (బాబు) సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన చైర్మన్ దేవస్థానం అధికారులు మరియు అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం అధికారులు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి, శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం...



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరం గ్రామంలో స్థానిక కాటన్ బ్యారేజ్ 41 వ గేట్ వద్ద ఉదయం 11:30 గంటల సమయంలో నలుపు రంగు కలిగి కోలమొహం కలిగిన గుర్తుతెలియని మగ మృతదేహం కొట్టుకుని వచ్చింది. ఇతని వయసు సుమారు 30-35 సంవత్సరాలు మధ్య ఉంటుంది అని ధవళేశ్వరం పోలీసు స్టేషన్ సి ఐ టి .గణేష్ తెలిపారు. ఇతని ఒక్కో కాళ్ళకి 6 వేళ్ళు కలవు, ఒక్కో చేతికి 7 వేళ్ళు కలవు అని ఇతని గురించి ఎవరికైనా ఆచూకీ తెలిసినచో ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ నందు ఈ క్రింది వారిని సంప్రదించమని తెలిపారు. సి ఐ 9440796586, ఎస్ ఐ 9491999336

## పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్‌లు..



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** పేదల ఆకలి తీర్చుందుకే అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారని మండల టిడిపి అధ్యక్షుడు జీను మణిబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో ఉచిత అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం గోకవరం మండలం భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు (రాము) తంటికొండ విద్యా కమిటీ చైర్మన్ నాగ వెంకటపతి ల ఆర్థిక సహాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీనుమణి బాబు హాజరై పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ రద్దు చేస్తే అప్పటినుంచి ఎమ్మెల్యే నెహ్రూ, నవీన్ ఆధ్వర్యంలో ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని తొందర్లోనే ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభం అవుతుందన్నారు. ఈవారం 500 మందికి అన్నదానం నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, పిలా మహేష్, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, వెలిశెట్టి బుజ్జి, కోడూరి రమేష్, చెలికాని హరిగోపాల్, వానశెట్టి శ్రీను, కుప్ప తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# 'రెగ్యులేటరీ అండ్ లీగల్ మేనేజ్‌మెంట్' పై శిక్షణ కార్యక్రమం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (వీశీమీవీజు) ప్రాయోజకత్వంలో "బుటిక్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ ఫర్ ఆప్టిమైజేషన్ ఆఫ్ బిజినెస్" ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం 9-3-2026 నుండి 14-3-2026 వరకు నిర్వహించబడుతుంది. వర్క్‌షాప్ నోడల్ అధికారి మరియు విభాగాధిపతి డా.కె.మీరాసాహెబ్ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టి) హైదరాబాద్ ప్రొఫెసర్ అన్నాజీ శర్మ హాజరయ్యారు. గౌరవ అతిథిగా జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు. అతిథులుగా రెక్టర్ ప్రొఫెసర్ వి.సుబ్బారావు మరియు జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.పద్మరాజు పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా.కె. మీరాసాహెబ్ అతిథులు మరియు పాల్గొనేవారిని స్వాగతించి, ఈ కార్యక్రమానికి మద్దతు అందించిన ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ హైదరాబాద్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ముంబై నుండి ప్రముఖ నిపుణులు మరియు పరిశ్రమల నిపుణులు పాల్గొని వివిధ అంశాలపై ఉపన్యాసాలు అందించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ అన్నాజీ శర్మ మాట్లాడుతూ, బుటిక్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ రంగంలో సృజనాత్మకత, డిజైన్ థింకింగ్ మరియు వినియోగదారుల అభిరుచులపై అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఫ్యాషన్ మరియు బుటిక్ వ్యాపారాలు చాలా కాలంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలంలో ప్రొఫెషనల్ మేనేజ్మెంట్ విధానాలు, నూతన ఆవిష్కరణలు మరియు సాంకేతికతను సమన్వయం చేయడం అవసరమని అన్నారు. ఈ రంగంలో యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పాల్గొనేవారిని ప్రోత్సహించారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాధారిత ఎంట్రప్రెన్యూర్‌షిప్ మరియు ఆవిష్కరణ ఆధారిత వ్యాపార నమూనాల ప్రాధాన్యతను వివరించారు. భారతదేశానికి వస్త్ర మరియు ఫ్యాషన్ రంగాలలో గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉన్నదని, సంప్రదాయ నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో మరియు వ్యూహాత్మక మేనేజ్మెంట్ పద్ధతులతో కలిపి స్థిరమైన వ్యాపారాలను నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు మరియు పరిశ్రమ నిపుణులు హాజరయ్యారు.

# ది.16.03.2026న శ్రీ సత్యదేవుని ఆలయ హుండీల లెక్కింపు

**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానము నందు భక్తులు సమర్పించుకున్న హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 16-03-2026 (సోమవారం) నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ది.16-03-2026 ఉదయం 7:30 గంటలకు నిత్య కళ్యాణ మండపంలో తెరిచి, అధికారుల సమక్షంలో కానుకలను లెక్కించడం జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే, సదరు నగదు మొత్తాన్ని దేవస్థానానికి సంబంధించి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని నిర్ణయించడమైనది. ఈప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ఈఓ త్రినాధరావు వెల్లడించాయి.



# ముఖ్యమంత్రి సహాయనిధితో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు



రావులపాలెం, మేజర్ న్యూస్ : ముఖ్యమంత్రి సహాయనిధితో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి ఎముక లేకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగా సోమవారం రూ.51,32,571లు అందించడం జరిగిందన్నారు. మానవసేవే మాధవ సేవగా భావించి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఎక్కడా లోటు లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులు ఇచ్చిన వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎప్పటికప్పుడు చెక్కులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో ఎవరికైనా సీఎం రిలీఫ్ ఫండ్ అవసరమైతే ఆసుపత్రిలో బిల్లులు తమకు అందిస్తే సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎవ్వరికీ దొరికేది కాదని, వారికి కావలసిన కొద్దిమందికే పరిమితమయ్యేదని ఆయన విమర్శించారు. నేడు వారు వీరు అని లేకుండా అందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఇంతటి బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు సర్వదా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 24 మందికి రూ.22,49,532లు, రావులపాలెం మండలానికి చెందిన 20మందికి రూ.12,07,081లు, కొత్తపేట మండలానికి చెందిన 17మందికి రూ.9,86,235లు, ఆలమూరు మండలానికి చెందిన 12మందికి రూ.6,89,723లు, మొత్తం 66 రీయంబర్స్మెంట్,7 ఎల్వోసీలు కలిపి రూ.51,32,571ల విలువైన చెక్కులను అందజేశారు.

## మహిళల భద్రత -బాలికల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ మరియు మానవహారం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మరియు పి ఆర్ కళాశాల సంయుక్తంగా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో పి.ఆర్.ప్రభుత్వ కళాశాల నుండి సెంటర్ వరకు మానవ హారం మరియు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు బేటీ బచావో – బేటీ పడావో, బాల్య వివాహాలకు నో చెప్పండి, ఆడబిడ్డను కాపాడండి – చదివించండి, బాలికల విద్యను ప్రోత్సహిద్దాం, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం, అమ్మాయిలు మన సమాజానికి ఆస్తి వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్.లక్ష్మి మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ ద్వారా పిసిపిఎన్‌డిటి చట్టం గురించి ప్రజలకు వివరించి, గర్భంలో శిశు లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని తెలియజేశారు. అలాగే బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాలికల విద్యాభివృద్ధి మరియు సమాన హక్కుల కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు. బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112,181 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు మరియు యువత ముఖ్య పాత్ర పోషించాలని తెలిపారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించి, వారి విద్యను ప్రోత్సహించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.సంజీవ్ కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట రావు, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ఆర్.శైలజ, విమెన్ సెల్ కన్వీనర్ డా. వై.బుజ్జి, యన్.యస్.యస్. కోఆర్డినేటర్లు, బాలల పరిరక్షణ అధికారులు కె.శ్రీనివాస్, జె.విజయ, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది చిన్నబాబు, దుర్గా భవాని మరియు వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, మహిళా పోలీస్ బొంతు అనూష మరియు వారి సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది లక్ష్మి, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ మరియు పి.ఆర్. కళాశాల విద్యార్థిని విద్యార్థినులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పిజిఆర్‌ఎస్‌కు ఐదు అర్జీలు



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, జి.ఎస్.డబ్ల్యూ.ఎస్. మేనేజర్ ప్రసాద్, వెంకటలక్ష్మి, సుజాత, ఆర్.ఐ. గంగాధరరావు, మున్సిపల్ సిబ్బంది, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు 450 అర్జీలు

- రెవెన్యూ క్లినిక్‌కు 25 అర్జీలు
- సకాలంలో నాణ్యతతో అర్జీల పరిష్కారం చేయాలి
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలపై అందిన అర్జీల పరిష్కారంపట్ల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జరిగాయి. పీజీఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి.. సీపీవో పీ.త్రినాథ్, డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ డా.జె.నరసిహనాయక్, జిల్లా ఉపాధి అధికారి జీ.శ్రీనివాసరావు డీఎల్పీవో వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం- 450 అర్జీలు అందాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా ప్రజా సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందుతున్న అర్జీలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలన్నారు. ఆయా శాఖలలో ఒకే అంశంపై మళ్లీ.. మళ్లీ అర్జీలు నమోదు అవ్వడానికి గల కారణాలు సంబంధిత అధికారులు సమగ్రంగా అధ్యయనం చేసి, అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. శాఖల వారిగా పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.

**రెవెన్యూ క్లినిక్‌కు 25 అర్జీలు..**రెవిన్యూ అంశాలలోని సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలు పైన జరిగింది. ఈ కార్యక్రమంలో డీఆర్వో తిప్పే నాయక్.. కెఆర్‌ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, పెద్దాపురం ఆర్డీవో ఎన్.శ్రీధర్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్ లైన్ లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం - 25 అర్జీలు అందాయని డీఆర్వో వెంకటరావు తెలిపారు.

ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్.. రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లతో అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి ఈ అర్జీలను గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమాలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఆదివాసీ వ్యాపారస్తులకు కేటాయించాలి

**చింతూరు, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ చింతూరులో నాలుగు మండలాల పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డిని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ కలిసి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు సొంతంగా పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి సరైన వెలుసుబాటులేక వారి పడుతున్న బాధలను వివరించడం జరిగింది. చింతూరు మెయిన్ సెంటర్‌లో ఆదివాసులు సొంతంగా పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి కనీస పరిస్థితులు లేక రోడ్డు పక్కన వలస వ్యాపారస్తులను బ్రతిమిలాడుకునే పరిస్థితి ఏర్పడిందని, కాబట్టి ఈ ప్రాంత ఆదివాసులకు అటువంటి పరిస్థితి లేకుండా చింతూరు మెయిన్ సెంటర్‌లో స్థిర వ్యాపార స్థావరాలను ఏర్పాటుకు ఐటీడీఏ ద్వారా మెయిన్ రోడ్ పక్కన ఉన్న పాత హాస్పిటల్ ప్రహరీ అనుకునీ ఉన్నవి తొలగించి ఐటీడీఏ ద్వారా భావనాలు నిర్మాణం చేసి స్థానిక ఆదివాసీలకు చేయించే విధంగా కృషి చేయగలరని రాష్ట్ర ఎస్టి



కమిషన్ చైర్మన్‌ని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, జెఏసి మండల చైర్మన్ పోడియం రామకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సమస్యలపై వినతులు

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారు లతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పోలవరం జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఐటీడీఏ ఎపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ మాట్లా



డుతూ వివిధ సమస్యలపై ఈ వారం సుమారు 64 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆదేశించారు. దేవీపట్నం మండలం పాముగండి గ్రామానికి చెందిన కోసు జగ్గమ్మ వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కోసు బాలుదొర తనకు 53 సంవత్సరాలు నిండాయని, వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. నేషనల్ హైవే 516లో ఇంటి భూమి కోల్పోయిన తనకు ప్యాకేజీ చెల్లించాలని కె.రత్నం దరఖాస్తు సమర్పించారు. వై. రామవరం మండలం జంగల తోట గ్రామంలో ప్రస్తుతం చిన్న వాటర్ ట్యాంకు ద్వారా త్రాగునీరు సరిపోవడం లేదని, కొత్త వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలని నైని సంజన, కొడుతూరి లోవ కుమారి, బూడిద బేబీ దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం మొల్లేరు పాలెం గ్రామంలో చిన్న వాటర్ ట్యాంకు ద్వారా త్రాగునీరు సరిపోవడం లేదని 126 కుటుంబాలకు కొత్త వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలని కనిగిరి దుర్గాప్రసాద్, సోముల గంగరాజు, సోముల అర్జున్ 30 మంది గ్రామస్తులు దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం బూరుగుపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు చేయించాలని, అలాగే 24 మందికి కొండపోడు పట్టాలు ఇవ్వాలని, రాజవొమ్మంగి మండలం కినపర్తి కొత్తవీధిలో 60 మంది కోందులు నివసిస్తున్నారని, తమకు త్రాగునీరు, కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా అడ్డతీగల మండలం అనిగేరి గ్రామంలో పిట్టవారిలొద్దిలో 27 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు కానీ పట్టాలు ఇవ్వలేదని, పట్టాలు మంజూరు చేయాలని పిట్ట పెద్ద వెంకటలక్ష్మి, బూడిద అచ్చిత, పిట్ట పోతిరెడ్డి, దాసరి ఏసుబాబు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల సాధికారతే సమాజ పురోగతికి మూలాధారం

- ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెద్దాపురం ఎంపిడిఓ కార్యాలయంలో ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డి, ఏఓ సత్యనారాయణమూర్తిల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మహిళలు శక్తిస్వరూపులని, సృష్టికి మూలం మహిళలు అని సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో విలువైనదని, ఆయన పేర్కొన్నారు. దీనిలో భాగంగా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జి.రోజ, సిబ్బంది ఎం.లీల, ఎ.సుశీల, ఎస్.రోజాలను వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మహేష్, రాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ళు గడిచినా సమస్యలు పరిష్కారించరా?

- ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** సంవత్సరాలు గడిచినా ఆదివాసీ సమస్యలు పరిష్కారం కావడంలేదని సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా అనుబంధం ఆదివాసీ గిరిజన సంఘం నాయకత్వంలో రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజవొమ్మంగి మండలం బొరుకుపల్లిలో కొంతమందికి అటవీ హక్కులు కింద కొండ పోడు భూములకు పట్టాలు ఇచ్చి 24 మందికి గత రెండు సంవత్సరాలు నుండి వాయిదాలు వేస్తున్నారని తెలిపారు. ఈ కారణంతో గిరిజన రైతులకు రైతు భరోసా పడటం లేదన్నారు. ఆ గ్రామంలో తాగునీటి ట్యాంకు శిధిలావస్థలో ఉందని, మోటార్ చెడిపోతే అధికారులు ఎవరూ పట్టించుకోలేదన్నారు. వేసవికాలం రావడంతో ప్రజలు భయంతో ఉన్నారన్నారు. చెరుకుంపాలెం పంచాయితీ బోర్నగూడెం గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకునే 10 కుటుంబాలు గిరిజన, సన్నకారు రైతులకు వ్యవసాయ బోరులు, త్రాగునీటి బోరులు లేనందున ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం 20 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి, ఓపెనింగ్ చేసిన కొద్ది రోజులు తర్వాత వాటర్ సప్లై మానేశారని, వేసవికాలం రావడంతో ప్రజలు భయంతో ఉన్నారన్నారు. అడ్డతీగల మండలం. దొర మామిడి పంచాయితీ కినపర్తి గ్రామ కొత్త వీధిలో అడవికి చేరి ఉన్న కోందు ఆదివాసీలు 15 కుటుంబాలు 20 సంవత్సరాల క్రితం వలస వచ్చి అక్కడ అడవిపై ఆధారపడి జీవిస్తున్న వారిని రాజవొమ్మంగి ఫారెస్ట్ అధికారులు వేధించి కొట్టి చిత్రహింసలకు గురిజేసారన్నారు. రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాలలో బోరుకుపల్లి, బోర్నగూడెం, కినపర్తి, అనిగేరు గ్రామాలలో అధికారులు సమస్యలు పట్టించుకోని పరిస్థితి నెలకుందన్నారు.

ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు ఐటిడిఏ అధికారుల నిర్లక్ష్యాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు రాజవొమ్మంగి మండల పార్టీ కార్యదర్శి సోమల కుసల, అడ్డతీగల మండల పార్టీ కార్యదర్శి బూడిద వీరబాబు, సహాయ కార్యదర్శులు. పప్పుల కళావతి, పిట్ట పెద వెంకటలక్ష్మి, నాగులపల్లి అర్జునుడు, బూడిద అచ్చితం, డిప్పుల్ చిన్నబ్బాయి, మాడెం బాబురావు, నాగులపల్లి సంకురురెడ్డి, రాజారెడ్డి, పిట్టా ఎర్రపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ రైతుబజార్‌లో అక్రమాలపై కమిషనర్ సీరియస్

## :అధికారుల తీరుపై జొన్నాడ వెంకటేశ్వరరావు ఆగ్రహం





**కాకినాడ,మార్చి9(సూర్య ప్రతినిధి):** కాకినాడ నగరంలోని గాంధీనగర్ రైతుబజార్ అక్రమాలకు నిలయంగా మారిందని, వినియోగదారుల భద్రతను గాలికి వదిలేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ రైతుబజార్‌ను సందర్శించిన తరుణంలో అక్కడ నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు బయటపడ్డాయి.

**నిర్లక్ష్యంపై జొన్నాడ ధ్వజం..** రైతుబజార్‌లో నెలకొన్న సమస్యలపై తెలుగు దేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్ జొన్నాడ వెంకటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గాంధీనగర్ రైతుబజార్‌లో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని చాలా కాలంగా ప్రజలు మొరపెట్టుకుంటున్నా, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇది ముమ్మాటికీ యంత్రాంగం వైఫల్యమే" అని మండిపడ్డారు. వ్యాపారులు హద్దులు దాటి గట్లు నిర్మించుకోవడం వల్ల సామాన్య ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని, వెంటనే ఈ అక్రమాలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

**చొచ్చుకువచ్చిన గట్లు.. గాయపడుతున్న జనం...** రైతుబజార్‌లో కొంత మంది వ్యాపారులు తమకు కేటాయించిన స్థలం కంటే ఎంతో ముందుకు చొచ్చుకువచ్చి శాశ్వత గట్లు నిర్మించుకోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో తిరిగే సమయంలో ఈ గట్లు తగిలి వినియోగదారులు కిందపడి దెబ్బలు తగులుతున్నాయని, వృద్ధులు, మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారని స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు.

**చీకటిలో రైతుబజార్.. పార్కింగ్ కష్టాలు...** మార్కెట్ పరిసరాల్లో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, పార్కింగ్ సమస్యతో ట్రాఫిక్ స్తంభిస్తోందని ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన కమిషనర్, వెంటనే వీధి దీపాలను పునరుద్ధరించాలని మరియు పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

**కమిషనర్ హెచ్చరికలు:**

పరిస్థితిని సమీక్షించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ:

ఆక్రమణల తొలగింపు: నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గట్లను వెంటనే తొలగించాలి.

పారిశుధ్యం: మరుగుదొడ్లు, డంపర్ బిన్ల వద్ద అపరిశుభ్రత కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

సదుపాయాలు: వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్,పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలి.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్,శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అల్లవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పిండి గణేష్

**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు కట్టా మురళీకృష్ణ అధ్యక్షతన అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రెస్ క్లబ్ సభ్యులతో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గ ఎన్నికపై చర్చించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పిండి గణేష్, కార్యదర్శిగా కదలి రాజేంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా కలిగితి ఏసురత్నం, సంయుక్త కార్యదర్శిగా మట్టపర్తి త్రిమూర్తులు, కోశాధికారిగా వెన్నపు రవి, గౌరవ అధ్యక్షులుగా గెడ్డం సత్యనారాయణ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను బిజెపి రాష్ట్ర నాయకులు యాళ్ల దొరబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి కార్యదర్శి గంధం పల్లంరాజు, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, అల్లవరం జడ్పిటిసి కొనుకు గౌతమి మహేష్, ఏపీడబ్ల్యూజే బి.ఆర్. అంబేద్కర్ కోన సీమ



జిల్లా అధ్యక్షులు ఎం.ఎన్.వి.ప్రసాద్, ఏపీడబ్ల్యూజే సభ్యులు గుర్రం బాబ్జి, కోమగిరిపట్నం సొసైటీ–2 అధ్యక్షులు దాట్ల కృష్ణ, కొమర గిరిపట్నం గ్రామ సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఓడలరేవు సొసైటీ అధ్యక్షు లు లింగం చిన్ని, పలువురు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా 205 అర్జీలు స్వీకరణ

**– జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల ద్వారా ప్రజల నుండి మొత్తం 205 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ తెలిపారు. విభాగాల వారీగా అందిన అర్జీల్లో రెవెన్యూ (రెవెన్యూ క్లినిక్)కు 87, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు 57, హోం శాఖకు 11, ఎనర్జీ శాఖకు 8, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు 5, కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ట్రాన్స్‌పోర్ట్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమం, పశుసంవర్ధక, పాలు మరియు మత్స్య శాఖ, పాఠశాల విద్య శాఖలకు చెంది 3 అర్జీలు చొప్పున అందాయన్నారు.

జల వనరుల, ఆర్థిక శాఖ, వ్యవసాయం, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, మైనార్టీస్ వెల్ఫేర్ శాఖలకు చెందిన అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు.

ప్రజలు తమ సమస్యలను 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, అలాగే మీకోసం వెబ్ పోర్టల్ ద్వారా కూడా నమోదు చేయవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలు సత్వరంగా పరిశీలించి పరిష్కరించేందుకు వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ సూచించారు. అలాగే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ అధికారులు మండలాల వారీగా పర్యవేక్షించి సమర్థంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రెవెన్యూ క్లినిక్ ద్వారా ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి పీజీఆర్ఎస్ ఫిర్యాదులను జిల్లా స్థాయి అధికారులతో కలిసి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కిడ్నీ బాధితునికి
### రూ.30 వేలు ఆర్థిక సహాయం చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రెండు కిడ్నీలు పాడై ఆర్థిక సమస్యలతో అల్లాడుతున్న ఒక నిరుపేద కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచి ఆదుకున్నారు. వివరాల్లోకి వెళితే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐ.పోలవరం మండలం కేసనకూరు పాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ తన రెండు కిడ్నీలు పాడై అత్యవసర చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానిక కూటమి పార్టీ నాయకులు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. వారి దీనస్థితికి స్పందించిన మంత్రి సుభాష్ తక్షణ సహాయంగా రూ.30 వేలు చెక్కును ఆర్థిక సహాయంగా అందించారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని ఆర్థిక సహాయం అందించిన మంత్రి సుభాష్‌కు శ్రీనివాస్, ఆయన భార్య రేఖ, కూటమి పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధి కారి నక్క వెంకటేశ్వరరావు అన్నారు.సోమవారం ఆత్రేయపురం పిహెచ్సి వద్ద రక్త పరీక్షలకు చెందిన ల్యాబ్ను పరిశీలించి మలేరియా డెంగ్యూ సీజనల్ వ్యాధులు పట్ల ముందస్తు ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజలను వ్యాధులకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి ల్యాబ్ టెక్నీషియన్ కు వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించి సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణులు డాక్టర్ పి.సౌమ్య, డాక్టర్ హైమశ్రీ, రావులపాలెం సబ్ యూనిట్ ఆఫీసర్ చిటికెన వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టీ.అరుణ కుమారి, వైద్య సహాయకులు ఎం.టి.వి.ఎన్. మూర్తి మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

**– డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖర్‌రెడ్డి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామాలలో ఇంటి పన్నులు మరియు మంచినీటి కుళాయి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని, ప్రజలను డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డి కోరారు. సోమవారం పెద్దాపురం మండలంలోని వాలుతిమ్మాపురం గ్రామంలో ఆయన పర్యటించి, ఇంటి పన్నులు మరియు ఇతర పన్నుల వసూళ్ళ తీరు ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి గ్రామస్థులతో మాట్లాడి గ్రామ పరిధిలో పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు వివరించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.